# వేదవతి

వేదవతి భర్త తిప్పాకర్ రావుగారు వేదవతి కన్నా ఆరేళ్ళు చిన్నవాడు. వేదవతి ఇంటర్ చేస్తున్నపుడు తిప్పాకర్‌రావు అయిదో తరగతి. వేదవతి టీచర్ ట్రైనింగ్ పూర్తయ్యేసరికి తిప్పాకర్ ఎనిమిదో తరగతికొచ్చాడు.

వేదవతి ఇంటర్లో ఉన్నపుడు వేదవతి అక్కయ్య గాయత్రి ఏడోనెల చూలాలిగా ఇంటికొచ్చింది. అక్కయ్యకోసం వచ్చిన బాదరాయణశర్మ మరదలి చెయ్యి పట్టుకున్నాడు. అక్కకు చెప్తే అరణ్యరోదనే అయింది. బావలకు మరదళ్ళ మీద ఆపాటి హక్కుంటుంది లేవే. పరిహాసానికి చెయ్యి పట్టుకుంటే పరువు తియ్యాలా అంది. అమ్మ అంతే అంది. నాన్నా అలాగే అన్నాడు. అనుకున్నంత పనీ జరిగింది.

తిప్పాకర్‌రావు తల్లి రాజమ్మ 'నెలదాటిపోయిందమ్మా' అని గుర్తు చేసేదాక వేదవతి తల్లి గంగాయమ్మ సీరియస్‌గా తీసుకోలేదు. గంగాయమ్మకు వణుకు పుట్టింది. పురుడు పోసుకొని గాయత్రి మూడు నెలలలోపు అత్తారింటికెల్లే సరికి వేదవతికి వేవిళ్ళు ప్రారంభమయ్యాయి. తల్లి నోరు నొక్కుకుంది. 'నాకెందుకు చెప్పలేదే' అని చీపురు కట్టతో ఎడాపెడా బాదింది. చెప్తే మీరెవరూ పట్టించుకోలేదని వేదవతి ఏడ్చింది. అక్కయ్యకు చెప్తే ఎవరికీ చెప్పకు, నా కాపురంలో నిప్పులుపోయకు అని కాళ్ళు పట్టుకొని ఏడ్చింది.

గంగాయమ్మ, మంగలి మంత్రసానమ్మను, రాజమ్మను పట్టుకొని ఎన్నో తిప్పలు పడింది. ఎవరికి తెలికుండా జాగ్రత్త పడ్డాననుకుంది గంగాయమ్మ. ఎలా పడిందో గానీ నాలుగిళ్లవతలి శంకరశర్మ కన్ను పడింది. డిగ్రీ చదువుతున్న అతనికి అప్పటికే పెళ్ళయింది. ఏడాది తిరక్కముందే వేదవతికి మళ్ళీ రాజమ్మ అవసరం ఏర్పడింది. ఈ రెండో దఫా తండ్రి దత్తాత్రేయశర్మగారికి గంగాయమ్మ చెప్పక తప్పలేదు.

ఇంతెత్తు ఎగిరి గంతులేశాడు దత్తాత్రేయశర్మ. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుందని గంగాయమ్మ కర్తవ్యం గుర్తు చేసేసరికి దత్తాత్రేయ నోరు మూత పడింది. పెద్దకూతురు పెళ్ళికి సగం ఆస్తి హరించుకుపోయింది. వేదవతికి పెళ్ళయ్యేసరికి చిప్ప చేతికి వచ్చేటట్టుగా ఉంది. కాగల కార్యం గాంధర్వ వివాహం తీర్చినట్టవుతుందనిపించింది.

"వాడెవడో కనుక్కో, వాడితోనే గుట్టు చప్పుడుకాకుండా దాన్ని లేచిపొమ్మని రాజమ్మతో చెప్పించు. రాజమ్మకు కొంత డబ్బు ఇచ్చి దాని చేతిలో పెట్టు" అన్నాడు దత్తాత్రేయశర్మ.

"వాడెవడో కాదండీ మీ మేనల్లుడు శంకర్, వాడికి పెళ్ళయి రెండేళ్ళయింది. వాడు కావాలనే చేశాడు. ఇదెందుకు లొంగిపోయిందో అర్థంకాదు" అని తలబాదుకుంది గంగాయమ్మ.

"వాణ్ణి... వాణ్ణి... పట్టుకొని తన్నాలి. వాడు కౌరవ నరకంలో పడిపోతాడు" అంటూ రొప్పాడు

దత్తాత్రేయశర్మ.

"వాడిని అడగమూ అయింది. రాజమ్మ అడిగితే వాడేమన్నాడో తెల్సా? వాళ్ళ అత్తకు మీరు అలవాటని, తన భార్య సావిత్రి మీకే పుట్టిందని టముకు వేయిస్తానన్నాడు. రాజమ్మ నోరు మూసుకుని వచ్చింది" అంది ఏడుస్తూ గంగాయమ్మ.

సంఘంలో ఎంతో పూజ్యనీయుడై పూజలందుకుంటున్న దత్తాత్రేయ ఒళ్లంతా చెమటలు పట్టాయి. ఆ విషయం తెలిస్తే తన పరువేం కాను. "ఈముండ చక్కగ చదువుకోకుండా ఎన్ని సమస్యలు తెచ్చిపెట్టింది" అంటూ గోచి సర్దుకొని వేదవతిని అలిసిపోయేదాక కొట్టాడు దత్తాత్రేయశర్మ.

"దాన్ని ఇంట్లోంచి తరిమేయి. అది మనకు పుట్టలేదనుకుంటా" అంటూ వార్నింగ్ ఇచ్చాడు దత్తాత్రేయశర్మ.

"దాన్ని ఎక్కడికని తరిమేస్తారు? నాఖర్మ ఇట్లా కాలింది" అంటూ ఏడుపందుకుంది గంగాయమ్మ.

ఎలాగోలా ఆ గండం గడిచిపోయింది. అయిదేళ్ళు గడిచేసరికి ఆస్తి హారతి కర్పూరంలా హరించుకుపోయింది. ఇంట్లో సంపాదించే వారెవరూ లేరు. వ్యవసాయం నుండి నికరాదాయం తగ్గిపోయింది. ఏటా ఇంత భూమి అమ్మేయడంతో అదీ తగ్గిపోయింది. పెద్దాడు సదాశివ సిటీలో వెలగబెట్టే చదువుతో ఆకాస్తా వదులుకోవాల్సి వచ్చింది.

వేదవతి పెళ్ళి సమస్యై కూర్చుంది. కట్నాల రేటు పెరిగిపోయింది. ఊళ్ళో సంబంధాలు ఎప్పటికైనా మంచిది కాదనుకున్నారు. దూరపు సంబంధాలు వారి స్థాయికి అందలేదు. ఎలా కల్సిందో ఏమో. ఎవరికీ తెలియదు. ఒక శుభముహూర్తంలో సిన్మాకని బయల్దేరిన వేదవతి తిప్పాకర్‌రావుతో లేచిపోయింది. ఎందుకైనా పనికొస్తాయని అమ్మ దాచుకున్న నగలన్నీ మూటగట్టుకొని మరీ పారిపోయింది. ఊరంతా గుప్పుమంది.

ఆ అవమానం భరించలేక దత్తాత్రేయశర్మ బతుకుదెరువు వెతుక్కుంటూ బొంబాయికి బయల్దేరదీశాడు గంగాయమ్మను. అక్కడ షాపుల్లో ఫోటోలకు పూజలు చేస్తూ నెలకు అయిదు రూ॥లు గోర్ఖాల్లా అడుక్కునేవాడు. దత్తాత్రేయశర్మ ఆదాయం తక్కువైనా ఎంతో గౌరవం పెరిగింది. ఆయాచితంగా కట్నకానుకలందేవి.

వేదవతి తిప్పాకర్‌రావును చిన్నప్పుడు చాలా నీచంగా చూసేది. "అరె తిప్పా!" అంటూ పిలిచేది. "ఏందమ్మా" అంటూ తిప్పాకర్‌రావు వేదవతి ఎదుట చేతులు కట్టుకొని నిలబడేవాడు.

"ఇవ్వాళ మీ అవ్వ ఎందుకు రాలేదురా?"

"అవ్వకు జ్వరం వచ్చింది. నన్నే పోయిరమ్మంది"

అతడి అమాయకత్వం చూస్తుంటే అవసరం లేని పనులు కూడా చెప్పాలనిపించేది వేదవతికి.

తిప్పాకర్‌రావు అసలు పేరు తిప్పయ్య. వాళ్ళ తాత పేరును పెట్టుకున్నారు.

తిప్పాకర్‌రావుని పెళ్ళిచేసుకున్న తర్వాత వేదవతికి లోకం అర్థం అవుతున్న కొద్దీ భర్తను కించపరచడం వల్ల తానూ కించపరచబడతానని తెల్సిరాసాగింది. అట్లా వేదవతే తిప్పయ్యను తిప్పాకర్ అని పిలిచింది. అందరూ అలాగే పిలవడం ప్రారంభించారు. తర్వాత తిప్పాకర్‌రావు అని లీగల్‌గా పేరు మార్చుకొని పత్రికా ప్రకటన ఇచ్చారు. అప్పట్నించి తిప్పయ్య - తిప్పాకర్‌రావుగారు అయ్యారు. ఇప్పుడు వేదవతి "మా ఆయన" "మా వారు" అంటుంది. ఎవరికైనా చెప్పాల్సి వచ్చినపుడు తిప్పాకర్‌రావు గారు అని వత్తి పలుకుతుంది. ఆ మధ్యే ఫోన్ వచ్చింది.

ఫోన్‌లో వేదవతిని అని అనకుండా మిసెస్ తిప్పాకర్‌రావును మాట్లాడుతున్నానని అంటోంది. అట్లా వినడం తిప్పాకర్‌రావు గారికి ఎంతో సంతోషం కలిగిస్తుంది.

వేదవతికి ఆ విషయంలో తొలిగురువు అరణ్యకే. అరణ్యకకు అప్పుడు నాలుగో ఏడు నడుస్తోంది. అరణ్యకకు ఎల్.కే.జి క్లాస్‌మేటైన మేధ బర్త్‌డేకి వెళ్ళివచ్చాక రాత్రి నిద్రపోతూ మారాం చేస్తూ అడిగింది.

"మమ్మీ! నువ్వు డాడీని పేరు పెట్టి ఎందుకు పిలుస్తావు. నా క్లాస్‌మేట్స్ వాళ్ళమమ్మీలెవరూ అలా పిలవరు. ఈ రోజు డాడీని తిప్పాకర్ అంటూ గట్టిగా అరిచావు. స్వీటీ నన్ను అడిగింది. ఏంటి మీ మమ్మీ డాడీని పేరు పెట్టి పిలుస్తుంది అని" అంటూ బుంగమూతి పెట్టిన అరణ్యకను ముద్దు పెట్టుకొంది వేదవతి.

"మరి వాళ్ళ మమ్మీ వాళ్ళ డాడీని ఏమని పిలుస్తుందట" అని చిన్నపిల్లలా రాగం తీస్తూ అంది వేదవతి.

అరణ్యక స్వీటీ వాళ్ళ మమ్మీలాగే యాక్షన్ చేస్తూ చెప్పింది.

"ఏమండీ ఒకసారిలా వస్తారా! అని పిలుస్తుంది. ఇంకా దూరాన ఉంటే స్వీటీ! డాడీని మమ్మీ రమ్మంటోందని చెప్పి తీసుకురా అంటుంది. నువ్వేమో ఎప్పుడూ నాకలా పని చెప్పవు. ఎప్పుడూ ఎంత దూరాన ఉన్నా నువ్వే తిప్పాకర్ అని పిలుస్తుంటే నాకెంత ఇన్సల్టింగ్ ఉంటుందో తెల్సా?" అంది పెద్ద ఆరిందాలా అరణ్యక.

చిన్న పిల్లలు ఇంత సునిశితంగా పరిసరాల్ని పరిశీలిస్తారా అని ఆశ్చర్యపోయింది వేదవతి అరణ్యకను నా బంగారం అంటూ ముద్దులతో నింపేసింది. తనకు తిప్పాకర్‌పై ఎక్కడో ఏ మూలో ఉన్న చిన్నచూపు తన ప్రవర్తనలో ఏదో విధంగా బయటపడుతోందనుకుంది వేదవతి.

తిప్పాకర్‌తో కాపురం చేస్తూనే తాను తిప్పాకర్‌ను ఎందుకు చిన్నచూపు చూస్తోంది. కులం తక్కువ వాడనా? అరేళ్ళ వయస్సు తక్కువ వాడనా? ఉద్యోగం లేక ఆడక్కలా వంట చేసి పెడ్తున్నాడనా? తనకన్నా తక్కువ చదువుకున్నవాడనా? అమాయకుడనా? వేదవతి ఆలోచనలో పడింది.

వారం తిరక్కముందే వేదవతికి జీవితంలో మరిచిపోలేని అనుభవం ఎదురైంది. తమ స్కూలు కొలీగ్ పుల్లయ్య కూతురి పెళ్ళిలో పెళ్ళి భోజనాలయ్యాక పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్న వేదవతిని శ్రీలక్ష్మి "మీ ఆయన్ని కాస్త పిలు" అంది.

"ఏమండీ" అని పిలిచింది వేదవతి. ఆ పిలుపు కొత్తగా ఉండడంతో తిప్పాకర్ తనను కాదనుకొని ఎవరితోనో మాట్లాడుతున్నాడు. రెండుమూడుసార్లు పిలిచి తర్వాత తిప్పాకర్ అని పిలిచింది వేదవతి. తిప్పాకర్ పరుగు పరుగున వచ్చాడు.

"తిప్పాకర్! ఒక ఆరు స్వీట్‌పాన్‌లు కట్టించుకొస్తావా! అలాగే మా ఆయనకి ఓ గోల్డ్‌ఫ్లాక్ డబ్బా..." అంది శ్రీలక్ష్మి ఎంతో ప్రేమ ఒలకబోస్తూ, డబ్బులు చేతిలో పెట్టింది. జరిగిందేమిటో వేదవతికి అర్థమయ్యేలోగా తిప్పాకర్ అలాగే అంటూ డబ్బులు తీసుకొని బయటకు నడిచాడు.

అవమానంతో వేదవతికి కన్నీళ్ళు తిరిగాయి. తిప్పాకర్ వీళ్ళకు ఎలా కనడుతున్నాడు. అదే పని వాళ్ళాయనకు చెపొచ్చుగా వాళ్ళాయన్ని పిలిచి తానిలాగే చెప్తే ఊరుకుంటుందా? అతడాపని చేస్తాడా? తనతో పిలిపించి మరీ తన భర్తను ఎంత అవమానించారు. ఎక్కడుంది లోపం? తన ఇంట్లో తిప్పాకరే అందరికీ టీలు టిఫిన్లూ చేసి పెట్టడం, తమ ఇంట్లో కేరమ్స్ పేకాట, పచ్చీసు ఆడుతూ తిప్పాకర్‌కు పని చెప్పడం ఇదేనా అలుసుకు కారణం?

అప్పుడు నిర్ణయించుకుంది వేదవతి. ఆటలు తమ ఇంట్లో కట్టిపెట్టాలనీ ఇతర్ల ముందు తిప్పాకర్‌కు ఏ పని చెప్పకూడదనీ.

డాడీని మమ్మీ గౌరవిస్తుంటే మామమ్మీ చాలా మంచిది అని మమ్మీకి ముద్దిచ్చింది అరణ్యక. తిప్పాకర్‌కు ఉద్యోగం దొరికే దాక అరణ్యకను స్కూల్లో దింపి వచ్చేపని కూడా అతనికి చెప్పకూడదని రిక్షా మాట్లాడింది. అరణ్యక అట్లా రిక్షాలో వెళ్ళడం మొదలయ్యాక అమెలో మమ్మీపై మరింత ప్రేమ పెరిగింది. క్రమక్రమంగా బాగా గారాబానికి ఎగబడింది అరణ్యక.

తిప్పాకర్‌ను ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోమంది వేదవతి. ఎంత ఖర్చయినా ఫరవాలేదంది. పోటీ ప్రపంచంలో అది అంత సులువు కాదు. ఎక్స్‌టర్నల్ డిగ్రీ పరీక్షలు రాయమని పోరు పెట్టింది వేదవతి. ట్యూషన్ కోసం కొంతకాలం సిటీకి పంపింది. అరణ్యక గారాబం మరీ ఎక్కువైపోయింది. ఆమెను ఎలా కంట్రోలు చేయాలో అర్థం కాలేదు.

"డాడీ వచ్చాక చెప్తా నీ పని! ఎన్ని విరగ్గొట్టావో చెప్తే నీ పని చేస్తారు" అంటూ డాడీ పేరిట బెదిరించడం ప్రారంభించింది వేదవతి. ఆ మంత్రం బాగానే పని చేసింది.

తిప్పాకర్ ఇంట్లో లేకపోవడం చూసి వొకరాత్రి వేదవతి బావ బాదరాయణశర్మ వచ్చాడు. ఎట్లా తెల్సుకున్నాడో. వేదవతికి ఏం చేయాలో పాలుపోలేదు. తన జీవితం ఇట్లా ఎందుకవుతుందని ఒకవైపు ఏడుపు వస్తోంది. మరోవైపు ఎక్కడలేని ఆగ్రహం కలుగుతోంది. పెనుగులాట చూసి అరణ్యక మమ్మీ అంటూ బిగ్గరగా ఏడుపందుకుంది.

వేదవతి అతడి చేతిని మెలి తిప్పి సీటుపై గట్టిగా తన్నింది. గోడకు కొట్టుకున్నాడు. కింద పడదోసి కాలితో తన్నింది. అమ్మో అంటూ గిలగిల తన్నుకున్నాడు బాదరాయణశర్మ.

వేదవతి గబగబా ఫోనెత్తింది. "హలో శ్రీలక్ష్మి ఎవరో ఇంట్లో చొరబడ్డారు. నాకు భయంగా వుంది. వెంటనే మీ ఆయన్నీ తీసుకొని స్కూటర్‌పై బయల్దేరు" అంటూ వగరుస్తూ చెప్పింది వేదవతి.

ఫోన్ పెట్టేసి దొరికిన రూళ్ళకర్రతో ఎడాపెడాబాదింది వేదవతి. శర్మ పళ్ళు విరిగి రక్తం కారింది. రూళ్ళకర్ర విరిగిపోయింది.

స్కూటర్ హారన్ విని తలుపు తీసేసరికి శ్రీలక్ష్మి లోపలికి వస్తున్నంతలో అతడు వారిమధ్య నుండి గబగబా పారిపోయాడు.

"ఎవడై ఉంటాడు" అంటూ వణుకుతోంది శ్రీలక్ష్మి.

"ఎవడో దొంగో గుండాయో. పిలిస్తే ఎవరోనని తలుపు తీయగానే మీద పడ్డాడు" అంటూ జరిగిన సంఘటన వివరించింది.

మూడు రోజుల తర్వాత రాత్రి తండ్రి దత్తాత్రేయశర్మ వచ్చాడు. "నా సంసారంలో చిచ్చు పెట్టడానికొచ్చావా? ఏవేవో మాయమాటలు చెప్పి మా ఆయనపై మనస్సు విరిచేసి విడిపోయాక కూతురి సంపాదనతో సుఖపడొచ్చని వచ్చావా? గెటవుట్! మా నాన్న ఎప్పుడో చచ్చిపోయాడు. ఏటా మా మ్యారెజిడేనాడు ఉదయం మానాన్నకు పిండప్రదానాలయ్యాకే సాయంత్రం మా మ్యారెజిడే జరుపుకుంటున్నాం" కాళికలా గర్జించింది వేదవతి.

హతాశుడై అది కాదంటూ ఏదో చెప్పబోయాడు దత్తాత్రేయశర్మ.

"ఐ డోంట్ వాంట్ టు హియర్ ఎనీథింగ్" అంటూ దొరికిన చీపురు కట్టతో ఎడాపెడా బాదింది వేదవతి. ఇంకొక్క క్షణం ఇక్కడ ఉన్నావంటే పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తాను. ఎవరో పిచ్చాడు వచ్చి అల్లరి చేస్తున్నాడని అంటూ ఫోనెత్తింది ముందుగా శ్రీలక్ష్మికి ఫోన్ చేసింది.

దత్తాత్రేయశర్మ ఒగర్చుకుంటూ గబగబా బయటకు నడిచాడు. మరుసటిరోజు లీవు

పెట్టి సిటీకి తిప్పాకర్ రావు వద్దకు బయల్దేరింది.

"ఏంటీ! దేవిగారు అకస్మాత్తుగా విచ్చేశారు" అంటూ సరసమాడాడు తిప్పాకర్. అరణ్యాక ఏదో చెప్పబోయింది. "ష్" అంటూ ముక్కుమీదవేలేసి వద్దని సైగచేసి నీ అల్లరంతా డాడీకి చెప్పనా' అంది వద్దని అరణ్యాక అడ్డంగా తలూపింది.

"మనం ఎక్కడికైనా కొద్దిరోజులు హనీమూన్ వెళ్దామా?" అని కొంటెగా నవ్వింది వేదవతి.

'పెళ్ళయ్యాక ఇన్నేళ్ళకు కలిగిందేమిటి ఈ చిలిపి కోరిక" అంటూ నవ్వాడు తిప్పాకర్.

"రుక్కూ నీకు చెల్లెలు కావాలా? తమ్ముడు కావాలా?" అంది వేదవతి.

"భలే భలే నాకు తమ్ముడే కావాలి. ఎప్పుడొస్తాడు మమ్మీ" అంటూ చప్పట్లు కొట్టింది అరణ్యాక.

"ఆమెకున్న యింగితం మీకు లేకపోయింది" అంటూ వేదవతి తిప్పాకర్‌కేసి చూస్తూ చిలిపిగా నవ్వింది. అంతలోనే యింగితం అని ఎంచి మా ఆయన్ని తిరిగి అవమానించానా అని ఫీలైపోయింది వేదవతి. తన నోటి నించి ఇంత నిర్లక్ష్యంగా మాటలెలా వస్తాయో అని తనను తాను తిట్టుకుంది వేదవతి. తిప్పాకర్ అదేమి గమనించలేదు. మరి నా స్టడీయో మురిపెంగా అడిగాడు.

"అదే వస్తుంది తిప్పాకర్ మీ శక్తి తెలియదా మీరు ఏకసంథాగ్రహి. ఐనా హనీమూన్‌లో స్టడీకి బోలెడు టైం దొరుకుతుంది. నేను కాస్త సహాయపడతానుగా" అంది వేదవతి.

రెండు నెలలు లీవు పడేసి ఆ తర్వాత అక్కడ్నించి బదిలీ చేయించుకొని కొత్త ఊళ్ళో కాపురం పెట్టింది వేదవతి. అంతదాక ఆవూరి గడప తొక్కలేదు.

అయిదేళ్ళు గడిచాయి. అరణ్యాక అయిదో తరగతి చదువుతోంది. అరణ్యాక తమ్ముడు మాలవ్యా ఒకటో తరగతి చదువుతున్నాడు. చనిపోయిన తన తండ్రి మల్లయ పేరును కాస్త సంస్కరించి మాలవ్యా అని పెట్టాడు తిప్పాకర్. ఆ సరికి తిప్పాకర్ డిగ్రీ పూర్తయి పి.జి. ఫస్టియర్ చేస్తున్నాడు. ఆర్టీసిలో పని చేస్తూనే ఒక ప్రవేటు చిట్‌ఫండ్ ప్రారంభించాడు. తిప్పాకర్ పనితో బిజీ అయి పోయాడు. తనపై ఆధార పడ్డ కుటుంబం నుండి ఇపుడు తాను అందరిలా ఇల్లాలులా మారగలిగినందుకు వేదవతికి సంతోషంగా ఉంది. ఇప్పుడు గతమంతా ఆమెకొక పీడకల.

ఆ గతాన్ని ఆమె ఎప్పుడూ గుర్తు చేసుకోదు. పాత బంధుమిత్రులు కల్సినపుడు వేదవతి నిండు అహంకారంతో నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తుంది. వాళ్ళు మనస్సు నొచ్చుకొని మరోసారి పలకరించేవారు కాదు. వేదవతి కోరుకున్నది కూడా అదే. వాళ్ళరాకపోకలు అనవసర సమస్యలు తెస్తాయని గమనించింది.

"ప్రతి చిన్న దానికి డాడీకి చెప్తాను" అనడంతో మాలవ్యకు డాడీ ఒక భూతంలా కనపడసాగాడు. అంతదాక ఆడుకున్నవాడు తాను రాగానే ముడుచుకుపోయి ఓ మూలకు చేరడం తిప్పాకర్‌ను బాధించేది.

"మాల్యా ఇలారా!" అంటే బిక్కుబిక్కుగా వచ్చేవాడు.

"ఏంటిలా ముడుచుకు పోతున్నావు?"

"డాడీ మరేమో మమ్మీ నువ్వు బాగా కొడ్తావని బెదిరిస్తుంది. నువ్వు కొట్టవు కదూ"

ఇద్దర్ని దగ్గరికి తీసుకొని ముద్దుపెట్టుకున్నాడు తిప్పాకర్‌రావు.

"మీరిలాగే గారాబం చేస్తూ వెళ్ళండి. ఆ తర్వాత ఇక నా చావవుతుంది" అంది వేదవతి మూతి మూడు వంకరలు తిప్పుతూ.

"ఏంటివేదా! నన్ను వీళ్ళ ముందు అనవసరంగా ఒక దయ్యంలా ఎందుకు భయపడేట్టు చేస్తున్నావు. నాతో కల్సి ఆడుకోకుండా చేస్తున్నావు"

"మీరు ఎటేటో వెళ్తారు. వీళ్ళేమో అదనీ ఇదనీ నా ప్రాణం తీస్తారు. డాడీకి చెప్తాననకపోతే ఇక ఎవరి భయం ఉంటుంది" అంది వేదవతి బేలగా.

"అంటే నన్నో బూచిలా తయారుచేసి నువ్వు మాత్రమే వాళ్ళతో ఆడుకుంటావా! నన్ను ఆడుకోనీయవా?"

వేదవతి నిండుగా నవ్వింది.

"మమ్మీ బ్యాడ్ బ్యాడ్" అంటూ అరణ్యాక సంతోషంగా చప్పట్లు చరిచింది.

"అలా అనకూడదమ్మా! మమ్మీ అంటే కన్పించే దేవత" అంటూ గారాబంగా చెప్పారు రావుగారు.

"అయితే డాడీ! మరి మీరో... కనిపించే దేవుడు. మమ్మీ పార్వతి అయితే మీరు శివుడు... మమ్మీ లక్ష్మి అయితే మీరు విష్ణువు"

"తప్పమ్మా. అలా అనకూడదు. వాళ్ళు గొప్ప వాళ్ళు."

"మరి వాళ్ళెప్పుడూ కనిపించరుగా అందుకే మీరు కనిపించే దేవుళ్ళు..."

ఆమె మాట పూర్తి కాకుండా అరణ్యకను బిగ్గరగా ముద్దుపెట్టుకున్నారురావుగారు.

"నిన్ను గెలుచుకొని జీవితం గెలుచుకొన్నాను గెలుపునాదే" ఆనందంగా అంది వేదవతి.

"నీ వల్ల నా జీవితం గెలుచుకున్నాను. నిన్ను గెలుచుకున్నాను గెలుపు నాదే" అన్నారు రావుగారు.

❀ ❀ ❀

**ఆంధ్రభూమి (దిన పత్రిక) 9,మే,1999**